గురుకులంలో విషజ్వరాలు

రామాయంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట గురుకులాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. రెండు మూడు రోజులుగా పిల్లలు ఆస్పత్రుల బాటపట్టారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలతోపాటు, మోడల్ స్కూల్ బాలికలు సోమవారం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందుతున్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం వల్ల విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నట్లు తెలుస్తోంది.

సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ అభ్యర్థులుగా

కూన సంతోష్, షఫీలను ప్రకటించిన జగ్గారెడ్డి





సంగారెడ్డిలోని దర్గా వద్ద జరిగిన మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ అభ్యర్థుల పేర్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ఎన్నికలకు ముందుగానే ప్రకటించి రాజకీయ చర్చకు తెరలేపారు. సంగారెడ్డిలో ఆదివారం రాత్రి జరిగిన మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపల్ చైర్మన్‌గా యువజన కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, వైస్ చైర్మన్‌గా తాజా మాజీ కౌన్సిలర్ షేక్ షఫీ పేర్లను ప్రకటించారు. దీంతో అక్కడున్న వందలాది మంది జనం హర్షం వ్యక్తంచేశారు. చైర్మన్, వైస్ చైర్మన్లుగా తమ పేర్లను ప్రకటించడంతో కూన సంతోష్, షేక్ షఫీలు సంతోషం రెట్టింపైంది. సంగారెడ్డిలో పలు అభివృద్ధి పనులకు త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయిస్తామని జగ్గారెడ్డి తెలిపారు.

అరకొర చదువులు 6
ఎన్‌సీడీ సర్వేకు బ్రేక్ ! 7



ఉధృతంగా ప్రవహిస్తున్న హల్దీవాగు

మెదక్‌ను వదలని వర్షం

- రాత్రి ఎనిమిది గంటల నుంచి మళ్లీ..
- జిల్లా కేంద్రంలో రోడ్లు జలమయం
- తూప్రాన్ గాయత్రీనగర్ కాలనీలోకి నీరు

మెదక్ కల్చరల్/ తూప్రాన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రాన్ని వర్షం వదలడం లేదు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. సోమవారం రాత్రి ఎనిమిది గంటల నుంచి అర్ధరాత్రి వరకు వర్షం కురిసింది. దీంతో జిల్లా కేంద్రంలోని ఎంజీ, రాందాస్ చౌరస్తా, ఆటోనగర్ రోడ్లన్నీ చెరువులను తలపించాయి. తూప్రాన్ మండలంలో రాత్రి రెండు గంటల్లోనే 9.1 సెంటీమీటర్ల వర్షం కురిసిం ది. కుండపోత వర్షం కురియడంతో పట్టణంలోని గాయత్రీనగర్ కాలనీలోకి సోమవారం ఉదయానికి భారీ నీరోచ్చి చేరింది. ఫలితం గా ప్రజలు బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ఓ చికెన్ సెంటర్‌లోకి నీరు చేరడంతో మోటార్ల సహాయంతో తొలగించా రు. హల్దీవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటం తో రాత్రి నుంచి రాకపోకలు నిలిపివేశారు. యావాపూర్ వద్ద వాగుకు అడ్డుగా ట్రాక్టర్‌ను పెట్టారు. తూప్రాన్-కిష్టాపూర్ గ్రామాల మధ్య హల్దీవాగు ఉధృతంగా ప్రవహించడంతో పోలీసులు స్టాపర్లు పెట్టి వాహనాలు వెళ్లకుండా చేశారు. సోమవారం సాయంత్రానికి వాగు ఉధృతి కొంత తగ్గింది. గాయత్రీ నగర్‌లోనూ వరద తగ్గింది.



కూలిన పాఠశాల పైకప్పు పెచ్చులు..

అల్లాదుర్గం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి గడిపెద్దాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గది పైకప్పు పెచ్చుటూడి పండింది. ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పాఠశాల భవనం శిథిలం కావడం, నెలరోజులుగా తరుచు కురుస్తున్న వర్షం తాకిడికి పాఠశాల తరగతి గది పై కప్పు పెచ్చులూడాయని, ఆదివారం విద్యార్థులు లేని సమయంలో ఈ ఘటన జరగడంతో పెను ప్రమాదం తప్పిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



టెట్ టెన్షన్..!

- అర్హత ఉండాలంటూ సుప్రీం తీర్పు
- పదోన్నతులకు తప్పనిసరి చేస్తూ ఆదేశాలు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ టీచర్లకు టెట్ టెన్షన్ పట్టుకుంది. ఐదేళ్లకు పైబడి సర్వీస్ ఉన్న ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్(టీచర్‌ఎలిజిబిలిటీ టెస్ట్)లో ఉత్తీర్ణులు కాని పక్షంలో ఉద్యోగాన్ని వదులుకోవాల్సిందేనని ఇటీవల సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు ఉలిక్కిపడేలా చేసింది. ఈ తీర్పు ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు కూడా వర్తిస్తుందా అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సుప్రీంకోర్టు ఈ నెల 1న ఇచ్చిన తీర్పులో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా కొనసాగడానికి, పదోన్నతులకు టెట్ అర్హత తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఐదేళ్ల సర్వీసు ఉన్న వారు రెండేళ్లలో టెట్ ఉత్తీర్ణత సాధించాలని పేర్కొంది. లేని పక్షంలో ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపింది. పదవీ విరమణకు ఐదేళ్లలోపు సమయం ఉన్న టీచర్లకు మినహాయింపు ఇచ్చినప్పటికీ, వారు పదోన్నతుల కోసం టెట్ పాస్ కావాల్సి ఉంటుంది. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) ఆర్‌టీఈ-2010 నిబంధనల ప్రకారం టెట్ తప్పనిసరి చేయగా, ఉమ్మడి రాష్ట్రంలో 2012 డీఎస్సీలో ఈ నిబంధన అమలైంది. జిల్లాలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో

-మిగతా 8వ పేజీలో...

యూరియా కొరత

రైతుల కలత

అవే బాధలు.. అవే బారులు

- వ్యవసాయ పనులు వదులుకొని క్యూలలో..
- ఉమ్మడి జిల్లాకు కేటాయింపు తగ్గడమే కారణం
- దసరా దాకా ఇదే పరిస్థితి
- చల్లిన యూరియాపైనా భారీ వర్షాల ప్రభావం
- మళ్లీ మళ్లీ టోకెన్లకు..
- నియంత్రించలేకపోతున్న పోలీసు యంత్రాంగం



మెదక్ జిల్లా రామాయంపేటలో యూరియా కోసం రాస్తారోకో చేస్తున్న రైతులు

'రైతుల ఆందోళనలు, పోలీసుల కట్టడి వైఫల్యం, యూరియా కోసం బారులు'... ఇది ఉమ్మడి మెదక్ జిల్లాలో యూరియా కొరత వల్ల నెలకొన్న పరిస్థితి. దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది తీవ్రమైన యూరియా కొరత రైతులను వేధిస్తోంది. వానాకాలం సీజన్‌లో వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావాల్సిన రైతులు యూరియా కోసం క్యూ కడుతున్నారు. ఒక బస్తా కోసం రైతులు గంటల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొన్నది. దసరా పండుగ సమీపిస్తున్నా, రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ప్రభుత్వం యూరియా కేటాయింపులు తగ్గించడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగవుతాయి. వరి, మొక్కజొన్నకు రెండు విడతలు, పత్తికి ఒక విడత యూరియా చల్లాల్సి ఉంటుంది. అయితే, జూలైలో తొలి దఫా, ఆగస్టులో రెండో దఫా యూరియా అవసరం ఉన్నా, నిల్వలు లేకపోవడంతో రైతులు యూరియా వేయలేకపోయారు. ఇక రోజుల తరబడి బస్తాల కోసం పొద్దంతా పడిగాపులు కాస్తున్నారు.

- సంగారెడ్డి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

7

ఆగస్టులో యూరియా వివరాలు (టన్నుల్లో)

జిల్లా	అవసరం	వచ్చింది	రావాల్సింది
సిద్దిపేట	13,090	6,545	6,545
సంగారెడ్డి	6,616	4,675	1,541
మెదక్	10,810	8597	1,644
మొత్తం	30,516	19,817	9,730

సెప్టెంబరులో యూరియా వివరాలు (టన్నుల్లో)

జిల్లా	అవసరం	వచ్చింది	రావాల్సింది
సిద్దిపేట	8,060	6,643	1,417
సంగారెడ్డి	4,726	2,690	2,034
మెదక్	4,060	2,754	1,320
మొత్తం	16,846	12,087	4,771

చెరువులో మునిగిన ట్రాన్స్‌ఫార్మర్



కొడిపల్లి, సెప్టెంబరు 15, (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని మహ్మద్‌నగర్ పెద్ద చెరువు నిండుకుండలా మారింది. దీంతో చెరువు మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ నీట మునిగింది. 15 రోజులుగా ట్రాన్స్‌పార్మర్‌ను ఆనుకుని నీరు ఉండటంతో ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అసైన్డ్ భూములపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నర్సాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'అసైన్డ్ భూమికి ఎసరు' శీర్షికన ఈ నెల 13న ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు విచారణ చేపట్టారు. విలువైన అసైన్డ్ భూమిని నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేయడమే కాకుండా, నిర్మాణాలు లేకున్నా ఇంటి నంబర్లు ఎలా తీసుకున్నారనే విషయాన్ని ఆరా తీశారు. సోమవారం నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి సదరు భూమి వద్దకు వెళ్లి విచారణ జరిపారు. పూర్తి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తానని ఈ సందర్భంగా చెప్పారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

పారిశుధ్యానికి 'స్వచ్ఛ ఉత్సవ్'

సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం కార్యక్రమ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ రెండు వరకు అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు పారిశుధ్యంపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో పెద్దమొత్తంలో పేరుకుపోయిన వ్యర్థాల ప్రదేశాలను గుర్తించి ఎన్‌హెచ్‌ఎస్- 2025 ఫోల్డర్‌లో అప్‌లోడ్ చేయాలని, గుర్తించిన ప్రదేశాలను పూర్తిగా శుభ్రం చేసి, ఉపయోగపడేలా తీర్చిదిద్దాలన్నారు.

17 నుంచి స్వస్త్ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్



మెదక్ కల్చరల్, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లాలో 'స్వస్త్ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్' నిర్వహిస్తున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా మహిళలు, పిల్లలకు సాధికారత కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ చేపడతామన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రధాన ఆరోగ్య కేంద్రాలలో మహిళలు, పిల్లల అవసరాలపై దృష్టి సారించి, అన్ని అంగన్‌వాడీలలో పోషణ్ మాహ్ వేడుకలతో పాటు ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తాయని తెలిపారు.

పాలకమండలిపై పట్టు..!

- మంత్రి వర్సెస్ ఎమ్మెల్యే
- తాను చెప్పిన వారికే ఇవ్వాలని..
- ముగ్గురు మంత్రులు ఆమోదించినా కొలిక్కిరాని ప్రక్రియ



పటాన్‌చెరు సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు మార్కెట్ పాలకమండలి నియామకంలో పీటముడి పడింది. ముగ్గురు మంత్రులు ఆమోదం తెలిపినా పదవులు అందని ద్రాక్షలుగానే మారాయి. తాము సూచించిన వారికే పదవులు దక్కాలని మంత్రి, ఎమ్మెల్యే ఎవరికి వారు పట్టుపడుతుండటంతో ఈ విషయం రసకందాయకంలో పడింది. ఎవరికి వారు పట్టుదలతో ఉండటం, ఫైలు నేరుగా సీఎం కార్యాలయానికి పంపినట్లు సమాచారం. పటాన్‌చెరు మార్కెట్ యార్డ్‌కు పాలకమండలిని నియమించేందుకు నాటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహాలు నందిగామ మాజీ సర్పంచ్ శివానందం పేరును ప్రతిపాదిస్తూ జూన్ 26న సిఫారసు లేఖను పంపించారు. జిన్నారం మండలంలో ఓ ప్రైవేట్ ఫాంహౌస్‌లో నిర్వహించిన నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల అభీష్టం మేరకే ఎంపిక చేసినట్లు సిఫారసు లేఖలో పేర్కొంటూ లేఖను సీఎం కార్యాలయానికి పంపారు. దీనిపై మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఆమోద ముద్ర వేసినట్లు సమాచారం. ఆ తర్వాత మార్కెట్ పాలక వర్గ నియామయంలో రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌కు సన్నిహితంగా ఉండటంతో పాలకమండలి నియామక ప్రక్రియ నిలిచిపోయింది. తెల్లాపూర్ పురపాలక సంఘ పరిధి ఉస్మాన్‌నగర్ మాజీ ఉపసర్పంచ్ శ్యామ్‌రావు పేరును ప్రతిపాదిస్తూ ఎమ్మెల్యే మరో ఫైలు పంపారు. ఎమ్మెల్యే చేసిన సిఫార్సు మేరకు అధికారులు శ్యామ్‌రావుపై సైతం అన్ని రకాలుగా విచారణ పూర్తిచేసి నివేదిక సిద్ధం చేశారు. కానీ, పాలక మండలి నియామకంపై నిర్ణయం మాత్రం వెలువడలేదు. ఇద్దరూ తమ వర్గానికే పదవి దక్కాలని ప్రయత్నిస్తుండటంతో ఈ ప్రక్రియ కొలిక్కిరావడం లేదు.

కలెక్టరేటా.. పార్కింగ్ స్థలమా..?

- ప్రధాన రహదారిపై వాహనాల పార్కింగ్
- ప్రయాణికులకు ఇబ్బందులు
- చోద్యం చూస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులంతా ఈ రోడ్డు మీదుగానే వెళ్తుంటారు. పక్కన ప్రధాన రహదారిపై వాహనాలు అనధికారికంగా పార్క్ చేస్తున్నా వారు కనీసం పట్టించుకోరు. సాయంత్రం అయ్యిందంటే చాలు కలెక్టరేట్ పక్క రోడ్డంతా పార్కింగ్ స్థలంగా మారిపోతుంది. సంగారెడ్డి చుట్టు పక్కన అనేక పరిశ్రమలు ఉన్నాయి. ఆయా పరిశ్రమల బస్సులు, ఇతర వాహనాలన్నీ సంగారెడ్డి నుంచి ఉదయం పూట ఉద్యోగులకు తీసుకెళ్తుంటాయి. సాయంత్రం ఆయా కంపెనీలకు చెందిన వాహనాలను పట్టణంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో, ప్రధాన రహదారులకు పక్కన, కలెక్టరేట్ పక్కన పార్కింగ్ చేస్తున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన, కలెక్టరేట్ పక్కన వాహనాలను పార్క్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్లపై వాహనాలను వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పాదచారులు నడిచేందుకు అనేక తంటాలు పడాల్సి వస్తోంది. రాత్రి సమయంలో పార్కింగ్ చేసిన వాహనాలను చూసుకోకుండా ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.



సంతరోజు మరిన్ని అవస్థలు

సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలో ప్రతి ఆదివారం సంత జరుగుతుంది. సాయంత్రం సమయంలో జనంతో కిటకిటలాడుతుంది. కలెక్టరేట్‌నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు వాహనాల రద్దీ ఎక్కువగా వుంటుంది. రోడ్లకు ఇరువైపులా వాహనాలను అనధికారింగా పార్కింగ్ చేయడం వల్ల సంతకు వచ్చే వారు, ముఖ్యంగా మహిళలు రోడ్లు దాటేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు ఇరువైపులా వాహనాలను అనధికారింగా పార్క్ చేస్తున్నా పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్లు ధరించలేదని, రాంగ్ రూట్లో వస్తున్నారని చాలన్లు వేసే ట్రాఫిక్ పోలీసులు అధికారికంగా పార్కింగ్ చేస్తున్న వాహనాలపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యమేమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పట్టణంలోని రహదారికి ఇరువైపులా పార్కింగ్ చేస్తున్న వాహనాల యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రేమ వ్యవహారంతో మనస్తాపం..

సెల్ఫీ వీడియో తీసుకుంటూ యువకుడి ఆత్మహత్య


కమ్మరి నరేష్

తూప్రాన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంతో యువకుడు మనస్తాపానికి గురయ్యాడు. ప్రేమికురాలితో మాట్లాడి, చావును సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్సై శివానందం, కథనం ప్రకారం.. మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన కమ్మరి శ్రీనివాసచారి కుటుంబం కొన్నేళ్ల క్రితం తూప్రాన్‌కు వచ్చి ఉంటోంది. ఆదివారం శ్రీనివాసాచారి, భార్య గిరిజ, కూతురు భవానీలతో కలిసి గ్రామంలో అన్న నెల మాసికం కోసం వెళ్లాడు. చిన్న కొడుకు కిషోర్‌చారి సోమవారం ఉదయం పనికి వెళ్లాడు. ఇంటి వద్దనే ఉన్న పెద్ద కొడుకు కమ్మరి నరేష్ అలియాస్ నితిన్ (22) ప్రేమించిన యువతితో ఫోన్‌లో మాట్లాడినట్లు చెబుతున్నాడు. ప్రేమ వ్యవహారంలో మనస్తాపానికి గురైన నరేష్ తన మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియో రికార్డు చేస్తూ ఇంట్లో ఉరేసుకున్నాడు. పనికి వెళ్లిన కిషోర్ ఇంటికి వచ్చి తలుపులు తీసేందుకు ప్రయత్నించగా తెరవలేదు. దీంతో కిటికీ నుంచి చూడగా ఉరేసుకున్నట్లు గుర్తించాడు. ప్రేమ వ్యవహారంలో ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి శ్రీనివాసాచారి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం వివరించారు.

అరకొర చదువులు

షిఫ్ట్ పద్ధతిలో బోధన

ఆంధ్రజ్యోతి ఫోకస్

● చెట్లకింద, వరండాలో, మైదానాల్లో..
● భవన నిర్మాణాలపై దృష్టిపెట్టని పాలకులు, అధికారులు


వరాండాలో కూర్చున్న విద్యార్థులు


మల్‌చెల్మలో శిథిలమైన ప్రభుత్వపాఠశాల భవనం

జహీరాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడంలో పాలకులు, అధికారులు విఫలమైన నేపథ్యంలో అటువిద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు తిప్పలు తప్పడం లేదు. ఏగ్రామానికైన వెళ్లి చూసిన ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలే దర్శనమిస్తున్నాయి. పాలకులు మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులను కల్పించడంతోపాటు నాణ్యవంతమైన విద్యను అందిస్తున్నామని ప్రగల్బాలు చెబుతు న్నప్పటికి క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగఉంది. జహీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనఖీలుచేస్తే వాస్తవాలు బహిర్గతం కానున్నాయి. నియోకవర్గంలో చెట్లు, వరండాలే విద్యార్థులకు తరగతి గదులుగా మారాయి. ఇంకొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేనికారణంగ విద్యార్థిని, విద్యార్థులు ఇళ్ళకు వెళ్ళాల్సి వస్తుంది.

మూడు గ్రామాల్లో షిఫ్టు పద్ధతుల్లో విద్యాబోధన

మండలంలోని మల్‌చెల్మ, చిరాగ్‌పల్లి, ధనసిరి గ్రామాల్లోగల ప్రభుత్వఉన్నత పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి.ఏ క్షణమైన కూలనుందనే ఆందోళనతో విద్యాశాఖఅధికారులు ఆయా గ్రామాల్లోగల ప్రాథమిక పాఠశాలల్లో షిఫ్ట్ ప్రాతిపదికన విద్యార్థులకు విద్యనందించాలని నిర్ణయించారు. గదులుసరిపోవని భావించి షిఫ్టులపద్ధతిలో తరగతుల నిర్వహణ కొనసాగుతుంది. ఉదయంపూట ప్రాథమిక, మధ్యాహ్నం ఉన్నతపాఠశాలల తరగతులను నిర్వహిస్తున్నారు.విద్యాబోధన సక్రమంగానే జరుగుతుందని అధికారులు చెబుతున్నప్పటికి క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగ ఉన్నాయి.సమయం సరిపోవడంలేదని, పాఠాలు అర్థకావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. మూడేళ్లుగా షిఫ్ట్ పద్ధతుల్లో తరగతుల నిర్వాహణ కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ధనసిరిలో అదనపు తరగతిగదుల నిర్మాణప్రక్రియ అర్ధాంతరంగ నిలిచిపోయింది. నిధుల కొరత కారణంగ సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో స్లాబువేసి వదిలేశాడు. మల్‌చెల్మ గ్రామంలో భవనం శిథిలావస్థకు చేరింది. భవనాన్ని డిస్మెటల్‌చేసి నూతన భవనం నిర్మించాలని గ్రామస్థులు, అధికారులు పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించిన ప్రయోజనం కొరవడింది. చిరాగ్ పల్లిలో ప్రభుత్వం భవనం శిథిలావస్థకు చేరడంతో అక్కడే ఉన్న ప్రాథమిక పాఠశాల భవనంలోనే షిఫ్ట్ పద్దతిలో విద్యాబోధన జరుగుతుంది. రాష్ట్ర కాంగ్రెస్‌నాయకులు డా. సిద్ధం ఉజ్వల్‌రెడ్డి గ్రామానికి సేవచేయాలనే సంకల్పంతో తనసొంత నిధులతో పాఠశాలభవనం నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. త్వరలో భవనం పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నారు. త్వరలోనే నిర్మాణం పూర్తికానుందని అధికారులు, నాయకులు వివరించారు.

పాఠశాల భవనం తొందరగా నిర్మించాలి

మా గ్రామంలోగల ఉన్నతపాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రాథమిక పాఠశాలలో విద్యాబోధన జరుగుతుంది. విద్యాబోధనలో సమయం సరిపోక పోవడంతో పాఠాలు అర్థంకాక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మల్‌చెల్మలో సొంత భవనం నిర్మించాని కోరుతున్నాం.

-సంజన, (విద్యార్థిని-మల్‌చెల్మ)

నష్టం కలగకుండా చూస్తున్నాం

పాఠశాల భవనాలు శిథిలం కావడంతో మల్‌చెల్మ, చిరాగ్‌పల్లి, ధనసిరి తదితర గ్రామాల్లో షిఫ్ట్ ప్రాతిపదికన విద్యాబోధన జరుగుతుంది. విద్యార్థులకు నష్టం కలగకుండా చూస్తున్నాం. శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో కొత్తభవనాల నిర్మాణాలకు అవసరమగు ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరై భవన నిర్మాణాలు పూర్తైతేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం జరుగనుంది.

- మాణయ్య,ఎంఈవో

ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ


వినతులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్/మెదక్ మున్సిపాలిటీ/సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. ప్రజావాణికి మొత్తం 96 అర్జీలు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ.. ఒకే సమస్యలపైన పలుమార్లు వినతిని సమర్పించకుండా చూడాలన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి కాగానే.. తీసుకున్న నిర్ణయాలన్ని సదరు దరఖాస్తుదారుడికి సమాచారాన్ని అందించాలన్నారు.

మరమ్మతుల పనులు..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను త్వరితగతిన పునరుద్దరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం మున్సిపల్ డంపింగ్‌యార్డును అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లాలో ఈనెల 22 నుంచి 28 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు జరుగనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

సంగారెడ్డిలో..

ప్రజావాణిపై ప్రజల్లో అధికారులు నమ్మకం కలిగించాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు.

మెదక్ పోలీసు కార్యాలయంలో ..

పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

నిషేధిత మద్యం పట్టివేత

జహీరాబాద్, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి తెలంగాణాకు అక్రమంగా తరలిస్తున్న 8గ్రాముల చరస్‌ను ఎక్సైజ్‌అధికారులు పట్టుకున్నారు. వారికథనం ప్రకారం.. సంగారెడ్డిజిల్లా చిరాగ్‌పల్లి అంతరాష్ట్ర ఎక్సైజ్‌చెక్‌పోస్టు వద్ద సోమవారం వాహనాల తనఖీ కార్యక్రమం చేపట్టారు. ఢిల్లీకి చెందిన అమర్‌జీత్‌రాథే తన జీపులో గోవా నుంచి చరస్ తీసుకుని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుండగా వాహనం ఆపి తనఖీలు చేశారు. జీపులో చరస్, మద్యం లభ్యమైంది. వీటి విలువ సుమారు 60వేల వరకు ఉంటుందన్నారు. చరస్, జీపును స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశామన్నారు. అలాగే పలువురు వివిధ వాహనాల్లో 17.245 లీటర్ల గోవామద్యం తెస్తున్న క్రమంలో పటుకున్నారు. ఈ తనఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లాటాస్క్‌ఫోర్స్ సీఐ గాంధీనాయక్, ఎస్సైలు హన్మంతు, యాదయ్య, రమేష్, మురళీ, ఇబ్రహీం, రాజా, సిబ్బంది, తదితరులున్నారు.

బాలికపై అత్యాచార ఘటనలో నిందితుడికి 20 ఏళ్ల జైలు

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం మాడ్చెట్‌పల్లి గ్రామానికి చెందిన తలారి మోహన్‌కి బాలికపై అత్యాచారం చేసిన కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష ఖరారైంది పెద్దశంకరంపేట ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. 2020 సంవత్సరంలో మాడ్చెట్‌పల్లి గ్రామానికి చెందిన తలారి మోహన్ ఎనిమిదేళ్ల బాలికకు చాక్లెట్లు ఇప్పిస్తానని ఆశచూయించి ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపటారు. మెదక్ జిల్లా స్పెషల్ ఫోక్సో ఫాస్టు కోర్టులో పలు దఫాలుగా విచారణ చేశారు. తలారి మోహన్ నేరం చేసినట్లు రుజువైనట్లు గుర్తించిన జిల్లా సెషన్స్ న్యాయాధికారి నీలిమా అతడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

పాపన్నపేట, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్ గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారంమండల పరిధిలోని యూసుఫ్ పేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మిన్‌పూర్ శేఖర్(30) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం పొలం వద్దకు వెళ్లాడు. పొలం పనులు చేస్తుండగా పొలం గట్టుపై ఉన్న కరెంట్ వైర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబీకులు అతడిని చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందాడని చెప్పారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాజీ కౌన్సిలర్ హఠాన్మరణం


తాహేరాబేగం (ఫైల్)

జహీరాబాద్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, మాజీకౌన్సిలర్ గుండెపోటుతో ఆదివారం అర్ధరాత్రి హఠాత్తుగా కన్నుమూశారు. ఆమె మృతిపట్ల పలువురు పట్టణప్రజలు, నాయకులు, అభిమానులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆమె రెండవవార్డు కౌన్సిలర్‌గా మూడు సార్లు విజయం సాధించారని స్థానికులు తెలిపారు. ప్రజల మధ్యలో ఉంటూ ప్రజలకు తోచినస్థాయిలో సేవలందించిన తీరును గుర్తుకు చేసుకుని పలువురు కన్నీటిపర్యంతమయ్యారు. ఆమె భౌతికకాయానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. మాజీమంత్రి డా.చంద్రశేఖర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి, మాజీ టీఎస్‌ఐఐసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ తదితరులు ఆమె మృతిపట్ల విచారం వ్యక్తంచేశారు. ఆమె మృతదేహంపై పుష్పగుచ్చాలుంచి నివాళులర్పించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు 21 మంది ఎంపిక



కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మెదక్ స్టేడియంలో సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి కరాటే పోటీల్లో 21 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో బాలబాలికలకు జరిగిన పోటీల్లో మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాకు చెందిన 160 క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన 21 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. బుడోకాన్ కరాటే అకడామిక్ చెందిన శ్రీహిత, విద్యాదర్, శ్రీహర్షి ఉన్నట్లు మాస్టర్ సుభాష్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రకు
కమ్యూనిస్టులే వారసులు

- మహ్మదాపూర్ గుట్టల్లో అమరవీరుల స్మృతివనం ఏర్పాటు చేయాలి : సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి, నాయకులు

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 15 : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రకు వారసులు కమ్యూనిస్టులేనని, నాడు సీపీఐ పోరాటాల ఫలితంగానే తెలంగాణను దేశంలో విలీనం చేశారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాల వారోత్సవాల సందర్భంగా హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లోని అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం సాయుధ పోరాటాన్ని సాగించి, పేదలకు అండగా నిలిచిన పార్టీ సీపీఐ అన్నారు. ఈ సాయుధ పోరాటానికి ఎలాంటి సంబంధం లేని బీజేపీ పార్టీ తెలంగాణ సాయుధ పోరాట ఉత్సవాలను చేస్తామని ముందుకు వస్తున్నారని, ఇది కమ్యూనిస్టుల చరిత్రను కనుమరుగు చేసేందుకు జరుగుతున్న కుట్రని ధ్వజమెత్తారు. మహ్మదాపూర్‌లోని అమరుల ఘాట్ వద్ద స్మృతివనం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరామన్నారు. అలాగే ఇక్కడ కమ్యూనిటీహాల్‌ను నిర్మించాలన్నారు. గ్రామ శాఖ కార్యదర్శి పిట్టల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, జాగీరు సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న కాషాయవాదులు

దుబ్బాక, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని కాషాయీకరణ చేసి, మతం రంగుపులుముతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక మండల కేంద్రంలో నీలకంఠ సంఘ భవనంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.భాస్కర్ అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ ఎర్రజెండా నాయకత్వంలో కులమతాలకతీతంగా పోరాటాలు నిర్వహించి ఈ ప్రాంతంలో 10 లక్షల ఎకరాల భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోపాలస్వామి, దుబ్బాక మండల కార్యదర్శి నవీన, కొంపల్లి భాస్కర్, అంజయ్య, ఎల్లయ్య, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏ ప్రత్యేక బృందం వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారుల ప్రత్యేక బృందం

కంది, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కందిలోని జాతీయ రహదారిపై సోమవారం ఆర్టీఏ అధికారుల ప్రత్యేక బృందం వాహనాల తనిఖీ చేపట్టారు. జహీరాబాద్ పరిధిలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్ట్ ఏఎంవీఐ హితేష్‌చౌదరి ఆధ్వర్యంలో పరిశీలించారు. ప్రైవేట్ బస్సులు, లారీలు, డీసీఎంలు, బొలెరో వాహనాలు, ఫిట్నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుండా ఉన్న వాటికి జరిమానాలు విధించారు. జరిమానా కట్టని కొన్ని వాహనాలను సీజ్ చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. రవాణశాఖ అధికారుల ఆదేశాల మేరకు 15 రోజులపాటు తనిఖీలు నిర్వహిస్తున్నామని హితేష్ చౌదరి తెలిపారు.

అసంక్రమిత వ్యాధుల గుర్తింపు (ఎన్‌సీడీ - నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) స్క్రీనింగ్ సర్వే కోసం రాష్ట్ర ప్రభుత్వం గత నెల కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏఎన్‌ఎంలు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి 30 ఏళ్లు పైబడిన వారందరికీ బీపీ, షుగర్, మానసిక రుగ్మతలు, పాలియేటివ్ కేర్, వయోవృద్ధులకు సంబంధించిన స్క్రీనింగ్ సర్వే చేయాలనే ఆదేశాలు వచ్చాయి. అయితే, ఈ సర్వే చేయలేమని ఏఎన్‌ఎంలు చేతులెత్తేశారు. దాదాపు నెల రోజులుగా ఈ సర్వే నిలిచిపోయింది.



బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

ఎన్‌సీడీ సర్వేకు బ్రేక్!

పనిభారంతో ఏఎన్‌ఎంలు ససేమిరా

- కొత్త పోర్టల్ తీసుకొచ్చిన ప్రభుత్వం
- ఆభా వివరాల నమోదుకు ఆదేశాలు
- ఏఎన్‌ఎంల వైఖరిపై కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సీరియస్
- కఠిన చర్యలకు కలెక్టర్‌కు సిఫారసు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వాస్తవానికి ఎన్‌సీడీ స్క్రీనింగ్ సర్వేలో భాగంగా బీపీ, షుగర్ పరీక్షలు ఏటా నిర్వహిస్తారు. కానీ ఈసారి మరో ముందడుగు వేసిన ఆరోగ్య శాఖ కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి, 30 ఏళ్ల పైబడిన వారందరికీ ఆధార్, బయోమెట్రిక్ ద్వారా ఆభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) జనరేట్ చేసి, సదరు వ్యక్తికి ఉన్న అలవాట్లతో కూడిన ప్రశ్నావళిని పూరించాలని ఆదేశించింది. అలాగే వ్యాధుల వివరాలు కొత్త పోర్టల్‌లో నమోదు చేయాలి. ఏఎన్‌ఎంలు మాత్రం ఈ సర్వే చేయలేమంటున్నారు. ఇటీవల జిల్లా ఉన్నతాధికారులతో పాటు డీఎంహెచ్‌వోకు లిఖిత పూర్వకంగా రాసిచ్చారు.

ఏఎన్‌ఎంలకు 32 రకాల పనులు

సంగారెడ్డి జిల్లాలో సుమారు 250 మంది వరకు ఏఎన్‌ఎంలు పనిచేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు టీకాలు, బీపీ షుగర్ బాధితులకు మందులు పంపిణీ చేయడం, గ్రామాల్లో జ్వర, టీబీ, కుష్ఠు వివిధ రకాల సర్వేలు, రిజిస్టర్‌ల నిర్వహణ ఇలా సుమారు 32 రకాల పనులతో మోయలేని భారం పడుతోందని ఏఎన్‌ఎంలు పేర్కొంటున్నారు. ఇవన్నీ కాదని కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి మళ్లీ ఇంటింటికి వెళ్లి సర్వే చేయడం తమతో కాదని స్పష్టం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మందికి సెల్‌ఫోన్లు ఉండవని, ఇంటర్నెట్ సమస్యలు ఉన్నట్లు చెబుతున్నారు.

వ్యాధిగ్రస్థుల వివరాలు

సంగారెడ్డి జిల్లాలో 15,39,764 జనాభా ఉండగా, 30 ఏళ్ల పైబడిన వారు 8,04,980 మంది ఉన్నారు. వీరిలో బీపీతో 77,997 మంది, షుగర్‌తో 38,908 మంది, ఇతరత్ర క్యాన్సర్ లక్షణాలతో 354 మంది, అదేవిధంగా 414 మంది పాలియేటివ్ కేర్ సర్వీసెస్ పొందుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జిల్లాలో ఎన్‌సీడీ స్క్రీనింగ్ సర్వే చేయబోమని ఏఎన్‌ఎంలు ప్రజావాణిలో లిఖిత పూర్వకంగా రాసిచ్చారు. ఆ విషయం ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

-డా.నాగనిర్మల, డీఎంహెచ్‌వో, సంగారెడ్డి జిల్లా

సర్వే చేయాల్సిందేనంటున్న ఆరోగ్య శాఖ

ఇదివరకు కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసేవారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త పోర్టల్‌ను అమలులోకి తెచ్చింది. అయితే ఏఎన్‌ఎంల వైఖరిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సీరియస్‌గా ఉన్నట్టు తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లో సర్వే చేయించాల్సిందేనని జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు మౌఖికంగా సూచించినట్టు సమాచారం. ఒకవేళ ఏఎన్‌ఎంలు సర్వే చేయకపోతే కఠిన చర్యలకు త్వరలో కలెక్టర్‌కు సిఫారసు చేసే అవకాశం లేకపోలేదని ఆరోగ్య శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

'గీతం'లో ఘనంగా ఇంజనీర్స్ డే

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని కోగస్, గిట్ హబ్ కమ్యూనిటీ, ఇన్నోవేషన్ సెంటర్, కాడ్ ఏఐ విద్యార్థి విభాగాలు (క్లబ్‌లు) సోమవారం ఇంజనీర్స్ డే వేడుకలను సంయుక్తంగా నిర్వహించాయి. అభ్యాసం, ఆవిష్కరణ, వినోదాల మేలు కలయిగా ఈ కార్యక్రమం కొనసాగింది. తొలుత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు పుష్పగుచ్ఛాలు సమర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆయా క్లబ్‌లు ఇంజనీర్స్ ఎక్స్ పోను నిర్వహించి, గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని విద్యార్థుల నుంచి వినూత్న ప్రాజెక్టులు, సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించారు. అధునాతన సాంకేతికతలను తెలుసుకోవడానికి, ఆవిష్కర్తలతో సంభాషించడానికి విద్యారులకు ఈ ఎక్స్‌పో చక్కని అవకాశంగా మారింది. ఈ వేడుకల్లో భాగంగా, ఎల్ఎస్ఈజీ(ఎల్ఎస్ఎఫ్‌జీ)లో లీడ్ ఇంజనీర్ ఖాజా మొయినుద్దీన్ మొహమ్మద్ క్యాంపస్ నుంచి కార్పొరేట్ వరకు అనే అంశంపై అతిథ్య ఉపన్యాసం చేశారు. ఆయన ప్రసంగంలో, కార్యాలయ సంసిద్ధత, కెరీర్ వృద్ధి, కళాశాల జీవితం నుంచి కార్పొరేట్ ప్రపంచానికి విజయవంతంగా మారడంపై విలువైన విషయాలను పంచుకున్నారు. అనుకూలత, నిరంతర అభ్యాసం, పట్టుదల ప్రాముఖ్యతను తెలియజేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించండి పనిచేసే చోట నైతిక ప్రమాణాలు, పద్ధతులపై చర్చలో యువ నిపుణులు తమ కెరీర్లలోకి అడుగుపెడుతున్నప్పుడు బాధ్యతాయుతమైన పద్ధతులను స్వీకరించాలని మానసిక శాస్త్రవేత్తలు సూచించారు.



కార్యక్రమానికి హాజరైన అతిథులు

మంత్రి ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీలు



సంగారెడ్డిలోని మంత్రి దామోదర్ ఇంటి ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇంటిని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీప్రైమరీ పీఎంశ్రీ విద్యను నిర్వహించాలని, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌తో పాటు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు నూతన జాతీయ విద్యావిధాన చట్టాన్ని తెచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన మాట ప్రకారం కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు యాదగిరి, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శశికళ, మంగ, నాయకులు ఏసుమని, మంజుల, భ్రమరాంబ, కల్పణ, జమున, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టరేట్ సోమవారం ధర్నాలతో దద్ధరిల్లింది. పటాన్‌చెరు పారిశ్రామికవాడైన పాశమైలారంలోని సిగాచి పరిశ్రమ కార్మికులకు న్యాయం చేయాలని పలు ప్రజాసంఘాల నాయకులు, కార్మికుల కుటుంబసభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. జహీరాబాద్ చక్కెర కర్మాగారం కార్మికులకు న్యాయం చేయాలని, సంగారెడ్డిలోని సిద్ధార్థనగర్ శ్మశానవాటికకు దారిని మూసివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన నిర్వహించారు. నిమ్జ్ కోసం బలవంతపు భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని రైతులతో కలిసి సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలి

- 17 నుంచి సంగారెడ్డిలో నిరాహార దీక్షలు
- ప్రభుత్వాలు స్పందించకుంటే ఆమరణ దీక్ష
- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17 నుంచి 19వ వరకు సంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో నిరాహార దీక్ష చేయనున్నట్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టులో గెలుపోటములు సహజమని, కానీ కేసు ఓడిపోతే దానికి న్యాయవాదే కారణమంటూ కక్షిదారులు కొందరు కక్ష పెంచుకొని భౌతికదాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టం వుంటే సమాజంలో కొంత భయం ఉంటుందని అభిప్రాయపడ్డారు. సంగారెడ్డిలో మొదలైన తమ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేస్తామని, అవసరమైతే తాను ఆమరణ దీక్షకు కూడా వెనుకాడబోనని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.మహేష్, న్యాయవాదులు సుభాష్‌చందర్, భాస్కర్, రాములు, గోవర్ధన్, సతీష్, శ్రీకాంత్, మాణిక్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు నిరాహార దీక్షకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు.



నిరాహార దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్న న్యాయవాదులు

యూరియా కొరత.. రైతుల కలత

(5వ పేజీ తరువాయి)

యూరియా కొరత కారణంగా సంచలన ఘటనలు ఉమ్మడి జిల్లాలో చోటు చేసుకున్నాయి. పీఏసీఎస్ సొసైటీలు, రైతు వేదికల వద్ద చెప్పులు, పాస్‌బుక్ జిరాక్స్ పత్రాలు క్యూలైన్లలో పెట్టడం నిత్యకృత్యంగా మారింది. గజ్వేల్‌లో యూరియా కోసం ఇద్దరు మహిళలు చెప్పులతో కొట్టుకోవడం చర్చనీయాంశమైంది. మిరుదొడ్డిలోని రైతు వేదికలో ఫర్నీచర్‌ను రైతులు ధ్వంసం చేశారు. దుబ్బాకలో చలిమంటలు కాచుకుంటూ తెల్లార్లు టోకెన్ల కోసం ఎదురు చూసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికీ ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బస్తా యూరియా కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళనలకు దిగుతున్నారు. రైతులను కట్టడి చేయడంలో పోలీసు యంత్రాంగం విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరిపడా యూరియా నిల్వలు లేక వ్యవసాయాధికారులు ఆచితూచి టోకెన్లు పంపిణీ చేస్తూ.. కొద్దిరోజులుగా తెల్లవారుజామున్నే విధులకు హాజరవుతున్న పరిస్థితి పలు మండలాల్లో చోటు చేసుకుంది.

7వేల టన్నులు అవసరం

ప్రస్తుత నెలలో యూరియా సమస్య గట్టెక్కాలంటే దాదాపు 7వేల మెట్రిక్ టన్నులు అవసరం. సిద్దిపేట జిల్లాకు 3,988 టన్నులు, సంగారెడ్డి జిల్లాకు 2,036, మెదక్ జిల్లాకు 1,091 టన్నుల యూరియాను సరఫరా చేయాల్సి ఉంది. గత ఆగస్టులోనూ సరిపడా నిల్వలు సరఫరా లేకపోవడం వల్లనే పెద్దఎత్తున ఆందోళనలు నెలకొన్నాయి. ఆగస్టులో దాదాపు 10వేల టన్నుల సరఫరా నిలిచిపోయింది. ఇప్పుడు సెప్టెంబరులోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. వెనువెంటనే రావాల్సిన నిల్వలపై దృష్టి పెడితే రైతుల సమస్యలను పరిష్కరించవచ్చు. జూన్, జూలై మాసాల్లోనూ యూరియా కేటాయింపు తగ్గించడంతో నిల్వలు లేకుండా పోయాయి. లారీల్లో వస్తున్న యూరియా బస్తాలు నిమిషాల్లోనే కానరాకుండా పోతున్నాయంటే రైతులకు ఏ స్థాయిలో అవసరం ఉందో అర్థమవుతోంది.

క్యూలో నిల్చుంటే కూలీ

గంటల తరబడి క్యూలో నిల్చుంటే సమయం వృథా అవుతుందని భావించి పలువురు పెద్ద రైతులు కూలీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. పాస్‌బుక్, ఆధార్‌కార్డు పట్టుకొని లైన్‌లో నిల్చుని టోకెన్‌లు తెచ్చి ఇస్తే రూ.100 నుంచి రూ.200 దాకా కూలీ డబ్బు ఇస్తున్న పరిస్థితి పలుచోట్ల నెలకొంది. ఇక సాగు చేయని భూములకు సంబంధించిన రైతులు కూడా తమ పాస్‌బుక్ పేరిట రూ.280కి యూరియా బస్తాలను కొనుగోలు చేసి రూ.450 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్న సందర్భాలూ హుస్నాబాద్ ప్రాంతంలో వెలుగులోకి వచ్చాయి.

యూరియా వరదపాలు..

ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరద ప్రవాహాలు పోటెత్తుతున్నాయి. ఈ పరిస్థితి యూరియాపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. అష్టకష్టాలు పడి యూరియా చల్లగా వరదకు కొట్టుకుపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ మధ్య కాలంలో చల్లిన యూరియాతో ఫలితం లేకుండా పోయిందని.. రెండుమూడు మార్లు రైతులు టోకెన్ల కోసం వస్తున్నారు. ఇక నానో యూరియాతో అంతంత మాత్రమే ఫలితం ఉంటుందని పెదవి విరుస్తున్నారు. దీనిపై వ్యవసాయశాఖ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సంగారెడ్డి జిల్లా చౌటకూర్‌లో రైతుల నిరీక్షణ



జగదేవ్‌పూర్ గాంధీ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

అన్నదాతల రాస్తారోకో

జగదేవ్‌పూర్/రామాయంపేట/పుల్కల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంటల తరబడి నిరీక్షించిన యూరియా పంపిణీ చేసేందుకు అధికారులు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు జగదేవ్‌పూర్, రామాయంపేటలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. జగదేవ్‌పూర్ మండల కేంద్రానికి సోమవారం 560 బ్యాగుల యూరియా వచ్చింది. విషయం తెలుసుకుని మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద టోకెన్‌ల కోసం ఉదయం నాలుగు నుంచే క్యూలైన్‌లో పట్టాపాస్‌బుక్‌లు ఉంచి బారులు తీరారు. ఉదయం పది గంటల వరకు అధికారులు రాకపోవడంతో అన్నదాతలు మండిపడుతూ గాంధీ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు అక్కడకు చేరుకొని నచ్చజెప్పారు. మరో 400 బ్యాగ్‌ల యూరియా సోమవారం సాయంత్రానికి మండల కేంద్రానికి రానున్నట్లు తెలిపారు. మంగళవారం రైతులకు యూరియా టోకెన్‌లు అందించనున్నట్లు పేర్కొన్నారు. మెదక్ జిల్లా రామాయంపేటలోని సొసైటీ కార్యాలయం ఎదుట రైతులు చెట్ల కొమ్మలను వరుసలో ఉంచారు. వేకువజాము నుంచే వేచిచూసినా యూరియా రాలేదు. ఆగ్రహంతో రైతులు పట్టణంలో పాత హైవేపై రాస్తారోకోకు దిగారు. సీఐ వెంకటరాజాగౌడ్ చేరుకొని వారిని సముదాయించారు. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రానికి 540 యూరియా బస్తాల లోడు వచ్చింది. ఆధార్ కార్డు, పట్టదారు పుస్తకానికి రెండు యూరియా బస్తాల చొప్పున అందజేయగా, ఇతర మండలాల నుంచి కూడా రైతులు తరలివచ్చారు. ఒకరినొకరు తోసుకుంటూ దుకాణంలోకి ఎగబడగా, గందగోళ పరిస్థితి ఏర్పడింది. దీంతో నిర్వహకులు కొద్దిసేపు పంపిణీని నిలిపివేశారు. క్యూలైన్ ఏర్పాటు చేసి, బస్తాలను పంపిణీ చేశారు.

'సింగూరు'కు మళ్లీ వరద..
తెరుచుకున్న మూడు గేట్లు

ఇన్‌ఫ్లో 24,284.. ఔట్‌ఫ్లో 24,777 క్యూసెక్కులు

పుల్‌కల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు మళ్లీ వరద పోటెత్తుతున్నది. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వారం రోజుల క్రితం వరద పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో నీటి పారుదల శాఖ అధికారులు గేట్లన్నింటినీ మూసేశారు. రెండు, మూడు రోజులుగా ఎగువ నుంచి మళ్లీ ఉధృతంగా వరద ప్రవాహం ప్రాజెక్టులోకి చేరుతున్నది. దీంతో సోమవారం 8, 9, 10వ నంబర్ క్రస్ట్ గేట్లను మీటరున్నర ఎత్తి దిగువన మంజీర జలాశయానికి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 24,284 క్యూసెక్కులుగా నమోదైంది. మూడు క్రస్ట్ గేట్ల ద్వారా 21,840 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ గుండా 2,272 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 120 క్యూసెక్కులు, హెచ్ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, 390 క్యూసెక్కులు ఆవిరి అవుతుండగా మొత్తం ఔట్‌ఫ్లో 24,777 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 520.795 మీటర్లకు 17.544 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. సంగారెడ్డి సమీపంలోని మంజీర రిజర్వాయర్ 6, 7 నంబర్ క్రస్ట్ గేట్లను 4 మీటర్లు, స్కవర్ గేట్‌ను మీటరున్నర ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లుగానే దిగువన ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

ఏడుపాయల్లో కొనసాగుతున్న వరద

పాపన్నపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద వరద ప్రవాహం కొనసాగుతుంది. సింగూరు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఆలయం వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉంది. రెండు రోజులుగా ఆలయం మూసివేసి రాజగోపురంలో అమ్మవారికి పూజలు చేస్తున్నారు. వనదుర్గా ప్రాజెక్టు (ఘనపురం కట్ట) నుంచి 26,316 క్యూసెక్కుల వరద నీరు దిగువకు వెళ్తుంది.



సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

న్యూస్ బాక్స్

ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలిగా శ్రీవాణి

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ బెల్ శాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శ్రీవాణి, ఉపాధ్యక్షు రాలిగా కేఆర్‌కే శ్రీవల్లి, ప్రధాన కార్యదర్శి గీత, సంయుక్త కార్యదర్శి వీఆర్‌రాజేశ్వరి, అదనపు కార్యదర్శి పాతిమా, కోశాధికారి ఎంఎన్.పద్మజ, మహిళా సంఘం కన్వీనర్ గీతా రత్నకేశ్వరి, డివిజన్ కౌన్సిల్ సభ్యుడు జగదీష్‌సింగ్, కార్యవర్గ సభ్యులుగా ఉమా, జయప్రద, వీఎస్ఎన్ మూర్తి, ఇందిర, శ్రీదేవి, శుభాన్షిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి తీవ్రగాయాలు

నర్సాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌శాఖలో కాంట్రాక్టర్ వద్ద పనిచేయడానికి వచ్చిన ఇద్దరు స్తంభం ఎక్కి పనిచేస్తున్న క్రమంలో ఒక్కసారిగా షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. నర్సాపూర్ పట్టణ సమీపంలోని ఫైర్‌స్టేషన్ కోసం కొత్త భవన నిర్మాణం జరుగుతుంది. నిర్మాణానికి వైర్లు ఇబ్బందిగా ఉన్నాయని, మార్చాలని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ఆ శాఖలో కాంట్రాక్టర్‌గా పనిచేసే స్వామి తన సిబ్బంది సంతోష్, అనిల్‌తో సోమవారం వెళ్లాడు. ఈ క్రమంలో సంతోష్, అనిల్ స్తంభం ఎక్కి పనిచేస్తుండగా ఒక్కసారిగా ఇద్దరికి షాక్ వచ్చింది. వెంటనే వారిని కిందికి దించి నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒకరిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి, మరొకరిని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. కాగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి నర్సాపూర్ ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు.

హిందువుల ఐక్యతే లక్ష్యం

నారాయణఖేడ్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : హిందువుల ఐక్యతే లక్ష్యంగా విశ్వ హిందూ పరిషత్ సామాజిక సమరసత అభియాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ సామాజిక సమరసత అభియాన్ రాష్ట్ర కన్వీనర్ ధనుంజయ్ అన్నారు. సోమవారం ఖేడ్‌కు వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పూజ్యస్వామీజీల మార్గదర్శకంతో హిందువులు, కులాలు, వర్గాలు, వర్ణాల పురిట విడి పోరాదనే ఉద్దేశంతో ఈ సామాజిక సమరసత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

రామాయంపేట-నిజాంపేట హైవే ప్రారంభం

నిజాంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు, వరదలతో రామాయంపేట- సిద్దిపేట హైవేలో నిలిచిపోయిన వాహనాల రాకపోకలను అధికారులు ఎట్టకేలకు ప్రారంభించారు. ఈ హైవేపై వంతెన కుంగడంతో 20 రోజుల పాటు ఎన్‌హెచ్ 765 డీజీపై వాహనాల రాకపోకలు నిలిచిన విషయం విధితమే. వర్షాలకు దెబ్బతిన్న వంతెన స్థానంలో తాత్కాలిక వంతెనను నిర్మించారని, ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవచూపి శాశ్వత వంతెనను నిర్మించాలని ప్రజలు ప్రయాణికులు, ఉద్యోగులు తెలిపారు.

మల్కాపూర్‌ను సందర్శించిన యూపీ ప్రజాప్రతినిధులు

తూప్రాన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామాన్ని సోమవారం ఉత్తర్‌ప్రదేశ్ ప్రజా ప్రతినిధులు టీఎస్ఐఆర్డీ సీడీపీఏ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సందర్శించారు. మల్కాపూర్‌లో సిగ్రిగేషన్ షెడ్, రాక్ గార్డెన్, అంగన్వాడీ కేంద్రం, కమ్యూనిటీహాల్‌ను పరిశీలించారు. ఇందులో ఎంపీడీవో సతీష్, ఏపీవో సంతోష్‌రెడ్డి, ఏపీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'మిషన్ భగీరథ'లో సమస్య ఎందుకొస్తుంది?

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి
- అధికారులతో సమీక్ష



మిషన్ భగీరథ నీటి సరఫరాపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్న మంజీరా నీటి సరఫరాలో తరచూ సమస్య ఎందుకొస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి సంబంధిత అధికారులను ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం నర్సాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏదేని సమస్య వస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, రోజుల తరబడి నీటి సరఫరా నిలిపివేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ సరఫరా సమస్య ఇంతగా ఎప్పుడు రాలేదని ఇప్పుడే ఎందుకు వస్తుందన్నారు. ఒకవేళ సమస్య వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. కాగా ఈ మధ్య వర్షానికి దెబ్బతిన్న మోటార్లు, పైపులైన్ల వివరాలు ఇస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు వచ్చేలా చూస్తానని సునీతారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీరామచరణ్‌రెడ్డితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, డీఈఈ, ఏడీఈ, ఏఈలతో పలువురు నాయకులు పాల్గొన్నారు.

యాత్రాదానంతో ప్రయోజనాలు : ఎమ్మెల్యే

పటాన్‌చెరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పుణ్యక్షేత్రాలకు ప్రయాణం చేయాలనుకుంటున్న వారికి ఆర్టీసీ వారు ప్రత్యేకమైన సౌకర్యాలు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో రామచంద్రాపురం బెల్ డిపో మేనేజర్ సుధతో కలిసి గోడపత్రిక విడుదల చేసి మాట్లాడారు. పుణ్యక్షేత్రాల ప్రయాణం చేయలేని వృద్ధులు, దివ్యాంగులు, అనాథలకు పుణ్యక్షేత్రాలు చూపించేందుకు ఆర్టీసీ వారు ప్రవేశపెట్టిన పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు.

యాత్రా దానానికి దాతలు సహకరించాలి

నారాయణఖేడ్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా వెనుకబడిన పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థుల కోసం యాత్రాదానం చేయడానికి దాతలు సహకరించాలని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య కోరారు. ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుకునే చర్యల్లో భాగంగా టూర్ ప్యాకేజీలు, యాత్రాదానం అమలు చేస్తుందన్నారు. పూర్తి వివరాలకు 9959223170 నెంబరులో, మార్కెటింగ్ సేల్ ఇన్‌చార్జి పాండును 9441071134 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సమస్య పరిష్కారానికి ఆత్మహత్య సరికాదు

- సంగారెడ్డిలో ఆత్మహత్య నివారణ దినోత్సవ ర్యాలీ



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమస్య పరిష్కారానికి ఆత్మహత్య సరైనది కాదని సైక్యాట్రిక్ విభాగం హెచ్‌వోడీ ప్రొ.పి.శ్రీలక్ష్మి, ఆర్ఎంవో డా.రవికుమార్ అన్నారు. సంగారెడ్డిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జనరల్ ఆస్పత్రి సంయుక్తంగా సోమవారం ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా జీజీహెచ్ నుంచి ఎంసీహెచ్ వరకు ర్యాలీ నిర్వహించి కరపత్రాలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా.రవికుమార్ మాట్లాడుతూ మనుషులు నిరాశ చెందడం వల్లే ఆత్మహత్య ఆలోచనలు వస్తున్నాయన్నారు. భార్యా, పిల్లలు, తల్లిదండ్రులు, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఆత్మహత్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.మురళీకృష్ణ, మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.సుమయ, అసోసియేట్ ప్రొఫెసర్ సింధు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.బి.విజయకుమార్, వైద్యులు, సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : భూపాల్‌రెడ్డి



రైతులతో కలిసి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్/కల్హేర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన నియోజకవర్గంలోని మనూరు, నాగల్‌గిద్ద మండలాల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖేడ్‌లోని సబ్ కలెక్టర్ ఉమాహారతికి రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. పై రెండు మండలాల్లో సింగూరు బ్యాక్ వాటర్ వల్ల అధికశాతం భూములు ముంపునకు గురయ్యాయని, వరి, సోయాబీన్, పత్తి, మినుము, పెసర పంటలకు భారీగా నష్టం వాటిల్లిందన్నారు. అందువల్ల ప్రభుత్వం నష్టపోయిన రైతులకు వెంటనే ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. ఆయన వెంట నాగల్‌గిద్ద మండల అధ్యక్షుడు పండరి, మాజీ ఎంపీటీసీ నందుపటేల్, అశోక్‌పటేల్, శంకర్‌పటేల్, సోపాన్‌పటేల్, వెంకట్, రాజు, ఉల్లప్ప, బాలాజీ, నాందేవ్, తదితరులు ఉన్నారు. అలాగే కల్హేర్ మండలం చాప్టా(కె) గ్రామానికి చెందిన గాండ్ల మహదేవ్ తీవ్ర అనారోగ్యం పాలు కావడంతో ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.4 లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. సోమవారం మండల పరిధిలోని ఖానాపూర్(కె) గ్రామంలోని తన స్వగృహంలో బాధితుడికి ఎల్‌వోసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బసప్ప, మారుతి, నాగిశెట్టి, రాము పటేల్, పండరి, మోహన్‌సాగర్ పాల్గొన్నారు.

క్వాంటం యుగం సాంకేతిక విప్లవానికి నాంది

- మెదక్ డీఈవో రాధాకిషన్



విజేతలతో డీఈవో రాధాకిషన్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : క్వాంటం యుగం సరికొత్త సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతుందని డీఈవో రాధాకిషన్ పేర్కొన్నారు. 'క్వాంటం యుగం ప్రారంభ అవకాశాలు-సవాళ్లు' అనే అంశంపై ఈ నెల 12న నిర్వహించిన జిల్లాస్థాయి సెమినార్ విజేతలకు సోమవారం ఆయన కార్యాలయంలో ప్రశంసా పత్రాలు అందజేసి మాట్లాడారు. క్లిష్టమైన సమస్యల పరిష్కారంలో అత్యంత వేగవంతమైన క్వాంటం కంప్యూటింగ్ కీలక భూమిక పోషించనుందన్నారు. ప్రథమ స్థానంలో ధనుష్(సిద్ధార్థ్ స్కూల్ మెదక్), ద్వితీయ యశస్విని(గీతా స్కూల్ మంబోజిపల్లి), తృతీయ అభినయ(జెడ్పీహెచ్ఎస్ కూచన్‌పల్లి) స్థానంలో నిలువగా.. సోనా(సరస్వతి కాన్వెంట్ మెదక్), జయశ్రీ(తెలంగాణ గురుకుల బాలికల మెదక్), ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. ప్రథమ స్థానం పొందిన ధనుష్ ఈనెల 18న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సెమినార్‌లో పాల్గొంటారని డీఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు



పీసీసీ అధ్యక్షుడికి పూలమొక్క అందజేస్తున్న ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో త్వరలో గ్రామ, మండల కమిటీలను భర్తీ చేయనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారికి కచ్చితంగా సముచిత స్థానం దక్కుతుందన్నారు. జిల్లాలో 21 మండలాలు, మున్సిపాలిటీలలో పార్టీతో పాటు అనుబంధ కమిటీలను నియామకంపై పీసీసీ అధ్యక్షుడితో చర్చించానని, ఒకటి, రెండురోజుల్లో పేర్లు ప్రకటించనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలని పీసీసీ అధ్యక్షుడు సూచించినట్లు ఆంజనేయులుగౌడ్ తెలిపారు.

సరాఫ్‌పల్లిని సందర్శించిన డీపీవో

పుల్‌కల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పన్నుల వసూళ్లు, రికార్డులను నిర్వహణను పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ, వీధి లైట్లు తదితర వాటిపై పంచాయతీ కార్యదర్శి కృష్ణను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య సిబ్బంది ప్రతీరోజు గ్రామంలో చెత్త సేకరణ చేపట్టి, వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం డంపింగ్‌యార్డు, వైకుంఠధామాన్ని సందర్శించారు.

నైపుణ్యం పెంపొందించడానికే శిక్షణ

పెద్దశంకరంపేట/రామాయంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్లలో నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ అల్లాదుర్గం సీడీపీవో పద్మలత అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ్ బి పఢైబి కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న శిక్షణలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పుష్పలత, శ్రీశైల భాగ్యమ్మ పాల్గొన్నారు. రామాయంపేటలోని ఎంపీడీవో హాల్లో ఐసీడీఎస్ క్లస్టర్ పరిధి శిక్షణను సీడీపీవో స్వరూప ప్రారంభించారు.

మురుగు సమస్యలకు పరిష్కారం



శ్రీరామ్‌నగర్‌లో వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో మురుగు సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధి శ్రీరామ్‌నగర్ కాలనీలో పర్యటించి మాట్లాడారు. కాలనీల్లో శుభ్రత పాటించడానికి సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. అనంతరం యువజన వికాస సమితి వారు మోక్షగుండం విశ్వేరయ్య జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మెట్టు కుమార్‌యాదవ్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శంకర్, రఘు, అశోక్, పృథ్వీరాజ్, విజయకుమార్, సత్యనారాయణ, నిరంజన్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట బీఎంఎస్ ధర్నా

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కన్‌స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం నిధులు కార్మిక శాఖ అధికారులు అడ్డదారిలో కోట్లాది రూపాయలు కాజేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్మికులు నరేందర్, వెంకట్, సాయిలు, సుమన్, నర్సింలు, గణపతి, శ్యామల పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకంపై సామాజిక తనిఖీ

నాగల్‌గిద్ద, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నాగల్‌గిద్ద మండల కేంద్రంలో 2024-2025 సంవత్సరం ఉపాధిహామీకి సంబంధించి రూ.5 కోట్ల 65 లక్షల 47 వేల నిధులపై అధికారులు సోమవారం సామాజిక తనిఖీ చేపట్టారు. ఆయా గ్రామాల మాస్టర్ రోల్‌తో పాటు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల నివేదికను చదివి వినిపించారు. నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించి, రికవరీకి ఆదేశిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అదనపు పీడీ బాల్‌రాజ్, ఏపీడీ రాజు, ఏఈవో నగేష్, సోషల్ ఏపీవో మురళి, ఉపాధిహామీ సిబ్బంది, ఆడిట్ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లను వెంటనే పెంచాలి



వెల్దుర్తి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వెల్దుర్తి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వెంటనే ఆసరా పింఛన్లను పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి అన్నారు. ప్రభుత్వం ఆసరా పింఛన్లను పెంచాలని పెన్షన్‌దారులతో కలిసి సోమవారం తహసీల్దార్ బాలలక్ష్మికి వినతి పత్రం అందజేశారు.

●పుల్‌కల్ : వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ చెల్లించాలంటూ సోమవారం పుల్కల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు.

●హత్నూర: హత్నూరలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి గందగళ్ల ప్రసాద్ మాట్లాడారు.

●చేగుంట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన పెన్షన్ల పెంపు హామీలను నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొలుపుల రామస్వామి పేర్కొన్నారు. సోమవారం చేగుంట, నార్సింగి మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి నిర్వహించారు.

●జిన్నారం: జిన్నారంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు చంటి, సర్వేష్, రవి, సాయిలు ఆర్ఐ జయప్రకాష్ నారాయణకు వినవిపత్రం అందజేశారు.

●కొండాపూర్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్ అశోక్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు.

●చిన్నశంకరంపేట: మండల కేంద్రంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రెడ్డి గోపాల్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముట్టడించారు. మెదక్-చేగుంట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

●మనోహరాబాద్: పింఛన్లు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు బండారి లక్ష్మి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వర్గంటి మురళి ఆధ్వర్యంతో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



టెట్ మినహాయింపు ఇవ్వాలని అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్ జిల్లా ఉపాధ్యాయ బృందం

టెట్ టెన్షన్..!

(5వ పేజీ తరువాయి)

3103 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరిలో చాలామందికి టెట్ అర్హత లేదు. దాంతో తమకు ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం, విద్యాశాఖ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు సుప్రీం తీర్పును యువత స్వాగతిస్తోంది. కొంత మంది సీనియర్లు దశాబ్దాల తరబడి పాఠశాలల్లో బోధన చేస్తున్నారు. ఇప్పుడు వయసు, ఆరోగ్య సమస్యలు, ఇంటి బాధ్యతల వంటి కారణాలతో మళ్లీ పరీక్షకు సిద్ధమవ్వడం కష్టమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రప్రభుత్వం చొరవ చూపాలి

ప్రస్తుత ఉపాధ్యాయుల సేవలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాలు రూపొందించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. టెట్ అర్హతపై సడలింపులు లేదా ప్రత్యామ్నాయ పరిష్కారాలు అవసరమని వారు ఒత్తిడి చేస్తున్నారు.

మినహాయింపునివ్వాలి

2009 తర్వాత నియమించిన ఉపాధ్యాయులు వచ్చే రెండేళ్లలోపు టెట్ ఉత్తీర్ణత పొందకపోతే ఉద్యోగం కొనసాగించలేరని, పదోన్నతులకు అర్హత ఉండదని సుప్రీం కోర్టు నిర్ణయం విద్యావ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని, న్యాయనిపుణులతో సంప్రదించి, ఉపాధ్యాయులకు మేలు చూకూర్చే విధంగా చూడాలి. 2010 కంటే ముందు ఉద్యోగాల్లో చేరిన ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో సైతం మినహాయింపు నిచ్చేలా ఆలోచించాలి.

- మల్లారెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

ప్రసవం కోసం వస్తే.. గొలుసు కాజేశారు!

జోగిపేట రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రసవం కోసం ఆసుపత్రికి వస్తే సిబ్బంది గోలుసు కాజేసిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. అందోల్ మండల పరిధిలోని పోసానిపేట గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి ప్రసవం కోసం భర్త అశోక్‌తో కలిసి జోగిపేట ప్రభుత్వాస్పత్రికి వచ్చింది. ఆపరేషన్‌కు ముందు భాగ్యలక్ష్మి తన మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెల తాడును అక్కడున్న సిబ్బందికి ఇచ్చింది. ఆపరేషన్ అనంతరం తాను ఇచ్చిన పుస్తెలతాడును ఇవ్వమని అడగ్గా సిబ్బంది ఇవ్వలేదంటూ ఆరోపించింది. దీంతో బాధితురాలి భర్త అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాండు తెలిపారు.

'ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం'

కొడిపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్‌ను నిర్మూలించి, పర్యావరణాన్ని కాపాడుకుందామని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళశాల యూనిట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని రాయిలపూర్‌లో ఏడురోజుల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కరాటే మాస్టర్ కల్యాణ్, పోగ్రాం అధికారి సురేష్ మాట్లడుతూ స్వీయ రక్షణ పట్ల మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ప్రత్యేక శిబిరంలో భాగంగా 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ అంశంపై చిత్రలేఖన పోటీ లను నిర్వహించారు.

పొలాలను పూర్వస్థితికి తెచ్చేలా ప్రణాళికలు

నిజాంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇసుక మేటలను తొలగించి పంట పొలాలను పూర్వస్థితికి తెచ్చేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని ఎంపీడీవో రాజిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నందిగామ, నిజాంపేట, చల్మెడ గ్రామాల్లో ఇసుక మేటలు పెట్టి నష్టం వాటిల్లిన పంట పొలాలను సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి పథకం కింద పొందుపరిచి ఇసుక మేటలను తొలగిస్తామన్నారు. అయితే ఒక్కో రైతుకు గరిష్ఠంగా రెండు ఎకరాలను, ఎకరాకు 600 క్యూబిక్ మీటర్లు ఇసుక తీయడానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని, ఉపాధి జాబ్‌కార్డు ఉన్న రైతులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సోమలింగారెడ్డి, ఏపీవో శ్రీనివాస్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ



తలకొరివి పెట్టిన కూతురు

నిజాంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో చనిపోయిన తండ్రికి కూతురు తలకొరివి పెట్టిన విషాద ఘటన నిజాంపేట మండల పరిధి కాసింపూర్‌లో జరిగింది. తండాకు చెందిన ధరావత్ చందు(47) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. ఇతని భార్య కొన్నేళ్ల క్రితం విడిచి వెళ్లింది. కొడుకులు లేకపోవడంతో ఏకైక కూతురైన సోనీ తండ్రికి తలకొరివి పెట్టింది.